
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 20 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

| Editor : | Managing Editor : |
|---|---|
| J.C. CHOATE | JOSHUA GOOTAM |

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 9     జూన్ 1989     సంచిక 11

## సంపాదకీయము

### "వాటి వాటి జాతిప్రకారము పుట్టించును గాక"

### *(Let Each one Bring Forth After its Kind)*

ఆదియందు దేవుడు సృష్టిని జరిగించి, అది ఎట్టి మార్పుగాని క్రమముగాని తప్పకుండునట్లు ఒక సూత్రము చేసెను. ఆదిలో సృష్టి జరిగిన తరువాత అది గడ్డిగాని, చెట్లు, జలచరములు, జంతువులు, గాలిలో యెగురు పక్షులు లేక మానవులు వాటి సంతానమును బట్టి ఒక్కొక్కటి మార్పులేకుండ నుండునట్లు నిత్యసూత్రము చేయబడెను. దేవుడిట్లు సెలవిచ్చెను "వాటి వాటి జాతిప్రకారము పుట్టించును గాక". అదే క్రమము ఆదినుండి ఇప్పటివరకు కొనసాగుచున్నది. ఒక చెట్టు విత్తనము అదే చెట్టును ఉత్పత్తి చేసెను. అది మరో జాతి చెట్టును ఉత్పత్తి చేయదు. సృష్టి యందలి మిగిలిన వాటి విషయంలోనూ ఇదే క్రమము ఉన్నది. కాలగమనములో ఒకజీవి మరొక జీవిగా రూపాంతరము చెందలేదు.

సృష్టి తరువాత వేలసంవత్సరములు గతించి పోయినను

ఈనాడు జంతువులు జంతువులను, మొక్కలు మొక్కలను మను ష్యులు మనుష్యులను ఉత్పత్తిచేసే క్రమమే కొనసాగుచున్నది. ఫరో కాలంలో మానవుల యొక్కయు, జంతువుల యొక్కయు, మిగిలిన జీవరాసుల యొక్కయు మృతదేహములు చెడిపోకుండ భద్రము చేయ బడెను (Mummified). అప్పుడు, ఇప్పుడు కోతి ఒకే స్వరూపము కలిగియున్నది. అదే కుక్కలు, మొసళ్ళు, పక్షులు మనుష్యుల విష యంలోనూ తేడా కనిపించక పోవుట వాస్తవమైన విషయం. ఆకాలం నాటి గోధుమ గింజలు భద్రము చేయబడినవి. కొన్నివందల సంవత్స రముల తరువాత విత్తినపుడు అవి గోధుమలనే ఉత్పత్తి చేయు చున్నవి.

## విత్తిన దానినే కోయుదుము

ఆత్మీయముగా, విత్తనము దేవుని వాక్యము (లూకా 8:11). భౌతికమైన విత్తనము విత్తినప్పుడు దాని జాతి ప్రకారమే ఫలించెను. ఆత్మసంబంధమైన విత్తనము విషయంలోనూ ఇదే యదార్థము. ప్రపంచములో ఎక్కడ గోధుమ విత్తినను గోధుమ పంటనే కోయు దుము. గోధుమను విత్తి వరిని గాని, ప్రత్తినిగాని కోయలేము. ప్రకృతి సిద్ధముగ విత్తబడిన విత్తనము మాత్రమే మొలచును. ఆత్మ సంబంధమైన విత్తనము విషయములోనూ ఈ సూత్రమే వర్తించును. దేవుని వాక్యమును, సత్యమును లేక ప్రభువు బోధను స్త్రీ పురుషుల హృదయాల్లో విత్తినప్పుడు అది ప్రభువు సంఘమును, క్రైస్తవులను మాత్రమే తయారుచేయును. కాని మతశాఖల గూర్పులనుగాని, లేఖనముల బోధకు వ్యతిరేకముగా నమ్మి, ఆచరించే వారినిగాని, మానవులను వెంబడించే వారినిగా గాని తయారు చేయదు. దేవుని వాక్యమను విత్తనము ఆదిమ శతాబ్దములో ఏమి ఫలించెనో నేడు కూడ అదే విధముగ ఫలించుచున్నది. పేతురు, పౌలు మిగిలిన భక్తులు

ఆ కాలంలో ఎట్టి భక్తిని ఆత్మీయతను కలిగియుండి దేవుని విశ్వసించి ఆయన బోధకు ఎట్లు విధేయులైనారో మనము ఈనాడు అవే సత్యాలకు లోబడవలసియున్నది. వారు ఏ సంఘములో సభ్యత్వము పొందిరో మనము ఆ సంఘములోనే సభ్యులమై యుండవలెను. ఎందుచేత ననగా మనముకూడ అవే సత్యాలను వెంబడించియున్నాము. దేవుని వాక్యమను విత్తనము వారిని ఒక విధంగాను మనలను మరో విధంగాను తయారుచేయదు లేదా నడిపించదు.

యోహాను సువార్త 15వ అధ్యాయములో ద్రాక్షావల్లి తీగలను గూర్చి క్రీస్తు ఒక పాఠాన్ని బోధించెను. ఆయన ద్రాక్షావల్లి యని ఆయన అనుచరులు తీగెలు అని చెప్పెను. ద్రాక్షావల్లి సంఘమునకు తీగెలు సభ్యులకు లేదా క్రైస్తవులకు సాదృశ్యముగా నున్నవని దీని ఉద్దేశ్యము. ఒకే సంఘము సభ్యులనేకమంది (1 కొరింథ 12) తీగెలన్నియు ఒకే ద్రాక్షావల్లి నుండి ఏర్పడును. తీగెలన్నియు ఒకే ఫలము ఫలించును. తీగెలన్నియు ద్రాక్షావల్లితో కలుపబడి యుండి దానివలన జీవించును. ఒకే విత్తనము ఒకే ద్రాక్షావల్లిని మొలిపించి అది అనేక తీగెలువేసి ఒకే ఫలము ఫలించును.

ఒక క్రైస్తవుడు దేవుని వాక్యము బోధించినట్లు ప్రభువు కుటుంబములోను, సంఘములోను సభ్యుడుగానుండి తాను విధేయుడైన సత్యాన్ని ఒకనికి బోధించి నట్లయితే అతడు వేరొక బోధకు, వేరు ఆజ్ఞలకు విధేయుడు కాలేడు. అతడు నిజమైన క్రైస్తవుడు ప్రభువు సంఘ సభ్యుడు కాకుండ ఉండలేడు.

## మానవుల బోధలు

మానవుల బోధల ప్రకారము ప్రజలు అన్నిరకముల బోధలను వినవచ్చును. అనేక మార్గాల ద్వారా రక్షింపబడవచ్చును. అనేక

సంఘాలకు చెందవచ్చును. ఏ నామము ధరించినా నిజమైన క్రైస్తవుడుగా నుండవచ్చును. ఇది అసాధ్యమైన విషయం. నీవు ఏమి బోధించుచున్నావు? దేనికి విధేయుడవగుచున్నావు? నీవు క్రైస్తవుడవుగాగాని లేదా వేరే వాడవై గాని యుండాలి. నీవు ఏదో ఒక దానికే చెంది యుండగలవు. మనం మరల వెనుకకు వచ్చి మనమేమి విత్తుదుమో ఆ పంటనే కోయుదుమనే సత్యం దగ్గరకు వద్దాం. ఇది భౌతిక ప్రపంచంలో యథార్థం. ఆత్మీయ విషయాలకు సంబంధించి కూడ ఇది యదార్థమే.

నీవు క్రీస్తు నామమును ధరించకుండ ఒక మానవుని నామము ధరించినట్లయితే నీవు మతశాఖల సంఘములోగాని లేఖనములలో లేని వ్రాయబడని సంఘములో సభ్యత్వము కలిగియున్న యెడల ఇది నీకు ఒక హెచ్చరిక అనుకొనుము. ఎందుకనగా నీవు మనుష్యులు కల్పించిన బోధలకు విధేయుడవై దేవుని చిత్తమునకు విధేయుడవు కాలేదు. నీవు పాపముల విషయమై మారుమనస్సు పొంది దేవుని వాక్యము బోధించిన బోధకు విధేయుడవై నీ తప్పును సరిచేసికొనుము. అప్పుడు నీవు రక్షింపబడి ప్రభువు సంఘముతో చేర్చబడుదువు. దేవుని వాక్యమను విత్తనము నిన్ను మతశాఖల గుంపులలో చేర్చదు. ఎందుకనగా ఆ విత్తనము ఎల్లప్పుడు దాని జాతి ప్రకారము ఫలించును. దైవాజ్ఞకు మినహాయింపులు లేవు.

చివరిగా, మనము క్రైస్తవులముగా ఫలించవలసియున్నది. మనము అనేక సార్లు ఫలించ వలసినవారమైయున్నాము. ఆలాగున ఫలించక పోయిన యెడల ప్రభువుకొరకు ఎట్టి విలువను కలిగియున్నాము? ప్రతి జీవరాశి తిరిగి ఫలించుటకొరకు జీవించుచున్నది. మనం ఆ విధంగా ఫలించిన యెడల ప్రభువు యొక్క పని ఫలించును, వ్యాపించును. నిజముగా ఆయన ప్రజల యెడల ఆయన కోరిక ఇదే, అది ఎల్లప్పుడు సిద్ధించును గాక.

# ప్రభువు దినమా లేక సబ్బాతు దినమా?

(గత సంచిక తరువాయి)

—వి. యి. హోపర్డ

## ప్రభువు దినము

మానవుడు స్వభావసిద్ధముగ ఆరాధించు వాడై యున్నాడు. సృష్టికర్తయైన దేవుడు, ఆకాశమును భూమిని అందలి సమస్తమును సృష్టించిన దేవుడు మానవుని నిర్మించి ఉన్నతమైన వానిని ఆరాధించునట్లు ఆయన నియమించెను. ప్రపంచమందు మానవుని ఆత్మలో దేవుని సన్నిధి నివసించుచున్నది.

ప్రభువు దినము ఆరాధన దినము. అపొస్తలుల కార్యములు 20వ అధ్యాయములో సర్వశ్రేష్ఠుడైన దేవుని ఆదివారమున ఆరాధించిన మాదిరి యున్నది.

ఇది ఖాళీ సమయంలో సమయాన్ని గడపడంకోసం మనకు ఉద్దేశింపబడినది కాదు. ఇది ఖచ్చితముగ ఆచరించవలసినదై యున్నది. ప్రభువు దినం క్రైస్తవునికి ఖాళీ రోజు కానేకాదు. అది ఆరాధించవలసిన దినమైయున్నది.

ప్రభువు దినాన దేవుని ఆరాధించడం అంటే మిగిలిన ఆరు దినాలు నిర్లక్ష్యంతో గడపాలని అర్థంకాదు. ఒకరోజు మతమైతే అది దయ్యానిదే. ఒకడు ఆరురోజులు దయ్యమును ఆరాధించినట్లయితే యేడు దినములుకూడ దాని ఆరాధించినట్లే. విభజింపబడిన ఆరాధనను దేవుడు అంగీకరించడు. కొంతకాలమే క్రైస్తవులుగా ఉండే విధము లేదు; ఒకడు దేవుని సేవించాలి లేదా అపవాదిని సేవించాలి! మనము వారములో ప్రతిదినము దేవుని మార్గంలో భక్తిగా జీవించవలసియున్నది. అయితే ప్రభువు దినం క్రీస్తు ద్వారా ఆయనను ఆరాధించే నిమిత్తము ప్రత్యేకించబడియున్నది.

ఆదివారం దైనికముగా ప్రత్యేకింపబడి 'ప్రభువు దినమని' పిలువబడుచున్నది. క్రీస్తు ఆదివారమున సమాధిలోనుండి లేచెను (లూకా 24 : 1-8) ప్రభువు దినంగా పిలువబడుటకు ఆదివారానికి తప్ప మరేదినానికి యోగ్యతలేదు! పునరుత్థాన దినము ప్రపంచ చరిత్రలో గొప్పదినము. ఆ దినాన శిష్యులకు ఆయన బుజువులతో ప్రత్యక్షమయ్యెను. యోహా 20:1;19, 26. అపొస్తలులు సర్వసత్యము లోనికి నడిపింపబడుటకు పరిశుద్ధాత్మను పంపిన దినమది.

క్రీస్తు సంఘము ప్రారంభమైన దినము ప్రభువుదినమే. అ.కా 2 : 1-47. "పెంతెకొస్తు అను పండుగ దినము" ఎప్పుడు ఆదివారము ననే వచ్చునని లేవి 23 : 15-16 చెప్పుచున్నది.

## ప్రభువుదినము మరియు ప్రభురాత్రి భోజనము

ఆయన శిష్యులు ఆచరించునట్లు ప్రభురాత్రి భోజనమును క్రీస్తు నియమించెను. మత్త 26 : 26-28; I కొరిం 11 : 23,29. ప్రభువుదినము అనగా ఆదివారము. క్రీస్తు మరణమును జ్ఞాపకము చేసికొనుటకు తగి నదేకాని, మరే దినముకాదు. పౌలు త్రోయలో "ఏడు దినములు గడు పుట" ముఖ్యవిషయము. ప్రభురాత్రి భోజనము ద్వారా ఆదివారమున క్రీస్తు శరీరమును రక్తమును జ్ఞాపకము చేసికొనుటకు అనగా ఆరాధన కొఱకు ఆయన ఏడుదినములు గడిపెను. అపొ. కా 20 : 6-7.

పౌలు ఏడుదినములు త్రోయలో గడిపినప్పుడు విశ్రాంతి దినము కూడ గడిచెను. పౌలుగాని, ఇతర క్రైస్తవులుగాని ఏవిధం గాను "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించినట్లు కనపడదు." ఆదివారమున ఆరాధించుట కొరకు వారు ఏడుదినములు అక్కడే గడిపిరి.

"కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట

మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగుచేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పురికొల్ప వలెనని ఆలోచింతము" హెబ్రీ 10 : 25-27.

అపొస్తలుడైన యోహాను చెరసాలలో ఉన్నపుడు ప్రభువు దినమును గౌరవించి ఇట్లు పలికెను. "ప్రభువు దినమందు ఆత్మవశు డనై యుండగా..." ప్రక 1 : 10.

దేవునికి మానవునికి మధ్యవర్తిత్వము విషయంలో ప్రభువు దినం నాందియైయున్నది. క్రొత్తనిబంధనకు ప్రారంభమే ఆదివారం. అది మొట్టమొదట క్రీస్తు నామమందు పాపక్షమాపణ ప్రకటింపబడిన దినము (లూకా 24 : 46-49 అపొ.కా. 2వ అధ్యాయము) పూజ నీయుని జ్ఞాపకము చేసికొనుటకు ఆచరించవలసిన దినమది.

## ప్రభువు దినము యొక్క ప్రయోజనము

ప్రభువు దినము యొక్క ప్రయోజనమేమనగా మనము ఆత్మీయ ఎదుగుదల క్షేమాభివృద్ధి పొందుటయే. యేసు ఇట్లు పలికెను. "విశ్రాంతి దినము మనుష్యుల కొరకే నియమింపబడెను. గాని మనుష్యులు విశ్రాంతి దినము కొరకు నియమింపబడలేదు" మార్కు 2:27. సబ్బాతు దాని ఆచరణలు అది ఉన్నంత వరకు మనుష్యులకు మేలు చేయుటకొరకేనని ఈ వచనమును బట్టి అర్థమగుచున్నది.

క్రైస్తవులు ప్రభువు దినాన్ని వారియొక్క ఆత్మీయ స్వాతంత్ర్యమునకు, సిలువ వేయబడి, పాప పరిహారార్థమై చనిపోయి, తన రక్తముద్వారా స్వాతంత్ర్యాన్ని యిచ్చిన రక్షకుని జ్ఞాపకము చేసికొనుటకు ప్రపంచమంతయు, ప్రతి జాతి మనుష్యులు ఆయా భాషలు మాటలాడువారు ఆచరించవలెను.

## సేవ మరియు హెచ్చరికల దినము

ప్రభువు దినమైన ఆదివారం క్రైస్తవులకు ఆత్మీయవిందు జరుగు దినము. క్రీస్తు క్రైస్తవులు ప్రభువు బల్ల చుట్టు ఉండునట్టి సమయము. క్రీస్తు శ్రమలను మరణమును ప్రభురాత్రి భోజనములో ఆయన శరీరమును రక్తమును జ్ఞాపకము చేసికొనెడి సమయము (అపొ.కా. 20:7; I కొరింథి 11:23, 29).

కొరింథులో నున్న సంఘమునకు ప్రభురాత్రి భోజనమును గూర్చి వారికి బోధించుచు అపొస్తలుడు క్రీస్తు మాటలను గుర్తు చేసెను. "మీరు ఈ రొట్టెను తిని, యీ పాత్రలోనిది త్రాగునప్పుడెల్ల ప్రభువు వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు".

ఖచ్చితముగా క్రైస్తవులందరు ప్రభువు శరీరమును రక్తమును జ్ఞాపకము చేసికొనుటకు శ్రద్ధ కలిగియుండవలెను. "త్రాగునప్పుడెల్ల" అనగా ప్రతి ఆదివారమున ఆయన మరణమును ప్రచురించుచు ఆయన వచ్చువరకు దీనిని కొనసాగించవలెను.

దేవుని ఆరాధించుటకు క్రైస్తవులు కూడుకొని క్రీస్తుసేవకు ఇచ్చుట కొరకు ప్రభువు దినము ప్రత్యేకింపబడిన దినము (1 కొరింథి 16:1, 2). ఆదిమ క్రైస్తవులు "అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుట యందును ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:42).

## ఆదివారం కలిగే అస్వస్థత

ప్రభువు దినానికి ప్రపంచము ఎక్కువ ప్రాధాన్యత నిచ్చుట లేదు. నేను క్రైస్తవులమని చెప్పుకొనువారు ప్రభువు దినాన్ని గౌరవించలేక పోవడం నమ్మలేని నిజం.

సంఘ సభ్యుల మధ్య భయంకరమైనది, త్వరగా వ్యాప్తి చెందే వ్యాధిని గూర్చి మీరు విన్నారా? దాని పేరు ఆదివారంవ్యాధి

(Morbus Sabbaticus). దాని లక్షణాలు క్రింద పేర్కొనబడిన విధంగా ఉంటాయి.

"మార్బస్ సబాటికస్" లేక ఆదివారం వ్యాధి సంఘ సభ్యులకు వస్తుంది. అది అకస్మాత్తుగా ఆదివారం మాత్రమే వస్తుంది. శనివారం రాత్రి ఈ వ్యాధిలక్షణాలు కనిపించవు. హాయిగా నిద్రపోతాడు ఉదయాన్నే లేచి ఉదయాహారాన్ని చక్కగా భుజిస్తాడు. వెంటనే ఈవ్యాధి ప్రారంభమై ఉదయారాధన పూర్తయ్యేవరకు పీడిస్తుంది. మధ్యాహ్నం చక్కగా ఉంటాడు. మంచి విందారగిస్తాడు. చక్కగా నడుస్తాడు. ఆదివారం పత్రికలు చదివి రాజకీయ విషయాలు కూడ చర్చిస్తాడు. సాయంకాలం భోజనం చేసిన తరువాత ఆరాధనా సమయానికి మరోసారి ఈ వ్యాధి కనిపిస్తుంది. ఇంటివద్దనే ఉంటాడు. చక్కగా నిద్రపోయి సోమవారం ఉదయం పనికి బయలుదేరతాడు. అది మరల ఆదివారంవరకు ఆ వ్యాధి అతన్నేమీచెయ్యదు. దాని వివరాలు తెలియజేస్తున్నాము 1. అది సంఘస్తులకు మాత్రమే కలుగుతుంది 2. ఆదివారం తప్ప మరేదినాన్ని అది కనిపించదు 3. అది రోగి ఆకలికిగాని నిద్రకుగాని విఘాతం కలిగించదు 4. ప్రభువు దినాన 24 గంటలు మాత్రమే అది ఉంటుంది. 5. ఇది యెక్కువగా ఇంటి యజమానినే పీడిస్తుంది. 6. దీనికి వైద్యుడు పిలువబడ నక్కర లేదు 7. ఇది ఆత్మకు నాశనాన్ని కలిగిస్తుంది. 8. దీనికి ప్రార్థన, నమ్మకము తప్ప వేరే మందులేదు. అయితే వాటిని రోగి తిరస్కరిస్తాడు. 9. సద్భక్తి దీనికి విరుగుడు. 10. ఇది భయంకరంగా మగవారిపై విజయాన్ని సాధించి ప్రతిసంవత్సరం వేల మందిని వారిని సంపూర్ణతలోనికి ఎదగకుండ నరకంలోనికి తోడుకొని వెళ్ళుచున్నది.

ప్రభువు దినాన్ని గూర్చి మీ ఉద్దేశ్యం ఏమిటి? మీరు ఆత్మీయ రోగులా?

పరలోకమందలి దేవుడు నియమించిన, అపొస్తలులు ఆచరించిన ఆదివారం ఆరాధనను మనం కొనసాగిద్దాం.

అది విశ్రాంతి కొరకుకాదు, ఆరాధించుటకొరకు, ఒకరినొకడు పురికొల్పు కొనుటకు, గొప్ప భక్తితో కూడిన కార్యమైయున్నది. ఆదివారం ప్రభువు దినం! అది నీకొరకు ప్రభువు దినం.

ప్రభువు దినాన్ని "తండ్రుల దినం"గాను "తల్లుల దినం"గాను "అభినందనల దినం"గాను "పిల్లల దినం"గాను "వివాహ దినం"గాను "వినోదపు దినం" ఇంకా అనేక దినాలుగా అప్పుడప్పుడు మార్చుచున్నారు. ఆ దినం కొన్ని సాకులు కూడ చెప్పుచున్నారు. చదవండి.

"నేనొక పొలము కొనియున్నాను" దినము క్షమించండి.

"నేను అయిదు జతల యెడ్లను కొనియున్నాను" దినము "నన్ను క్షమించవలెనని వేడుకొనుచున్నాను"

"నేనొక స్త్రీని వివాహము చేసికొన్నాను" దినము "నేను రాలేనను" (లూకా 14 : 16-24)

ప్రభువు దినాన చాలా మందికి "సమయంలేదు"

నీవు ప్రభువు దినాన్ని విశ్వాసంతో ఆచరిస్తున్నావా? లేక మరో దినాన్ని నీవు ఆచరిస్తున్నావా? నీవు సంఘ సభ్యుడవా? అయినప్పటికీ ఆ దినాన ప్రభువు మందిరానికి వెళ్ళడం మానివేస్తున్నావా? దేవుని ఆరాధించుటకు ప్రభురాత్రి భోజనములో పాలు పొందుటకు క్రైస్తవులముగా మనకున్న తరుణాలు, కూడుకొనుటకు స్వేచ్ఛ ఉన్నప్పుడు ఒకడు కాదని చెప్పడం నిర్లక్ష్యము వ్యతిరేకమే కదా?

క్రైస్తవుల కూడికలో క్రీస్తు ఉండును "ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని చెప్పెను" (మత్త 18 : 20). సందేహంలేదు. వేల మంది ప్రభువు దినాన ప్రభువును నిర్లక్ష్యం చేయుచున్నారు. ప్రభువును నీవు నిర్లక్ష్యము చేయుదువా? (సమాప్తం)

— వి. ఇ. హోవర్డ్.

# అందరికి ఆహ్వానం

[ గత సంచిక తరువాయి ]

జె. సి. బెయిలీ.

బైబిలు మనకు మార్గదర్శియని మనము నమ్మవలెను. హెబ్రీ గ్రీకు భాషలందు యిది వ్రాయబడెను. 1900 సంllలకు పూర్వమే యిది వ్రాయబడుట పూర్తయ్యెను. మనము అనుసరింప దగిన గ్రంథ మని హెబ్రీ, గ్రీకు భాషలలో వ్రాయబడిన వేరొక గ్రంథమేదైనా గలదా? ఏదియును లేదు. గత 26 సంllలలో ఎక్కువ కాలము నేను భారతదేశములోనే గడపితిని. బైబిలు అనేక భాషలలో తర్జుమా చేయబడుటయు, ప్రజలు ఆగ్రంథమును తమ గ్రంథముగా చెప్పు కొనుట గూడ నాకు తెలియును. ఎందువలన? అది జీవగ్రంథమై యున్నది. ఎందుకనగా "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణా త్మలను కీళ్ళను మూలుగను విభజించు నంతమట్టుకు దూరుచు, హృద యము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది." (హెబ్రీ 4:12). ఇంకను లేఖనము యిట్లు చెప్పుచున్నది. "దైవ జనుడు సన్నద్ధుడై ప్రతిసత్కార్యమునకును పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుట కును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైయున్నది". (II తిమో 3:16, 17). దేవుని పథ కము ప్రకారము సమయము ఆసన్నమైనపుడు యేసుక్రీస్తు ఈలోక మునకు వచ్చెను (గలతి 4:4).

క్రీస్తు వచ్చువరకు యూదులు పాతనిబంధనచే నడిపింపబడిరి. "కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాల

శిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతి 3:24-25). సరియైన సమయమందు క్రీస్తు రాకమునుపు దేవుడు మిగిలిన ప్రజలను గూర్చి మరచిపోలేదు. "ఆయన గతకాలములలో సమస్త జనులను తమతమ మార్గములయందు నడువనిచ్చెను. అయినను ఆయన ఆకాశము నుండి మీకు వర్షమును, ఫలవంతములైన రుతువులను దయచేయుచు, ఆహారము ననుగ్రహించుచు, ఉల్లాసముతో మీ హృదయములను నింపుచు, మేలు చేయుటచేత తన్నుగూర్చి సాక్ష్యము లేకుండ చేయలేదని బిగ్గరగా చెప్పిరి". (అ.కా. 14:16, 17). ఇంకను పౌలు యిట్లు చెప్పుచున్నాడు. "ఏథెన్సు వారలారా, మీరు సమస్త విషయములలో అతి దేవతా భక్తిగలవారై యున్నట్టునాకు కనబడుచున్నది. నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దీనిమీద తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురపరచుచున్నాను. జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువై యున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువయున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు. మరియు యావద్భూమి మీద కాపురముండుటకు ఆయన యొకని నుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించి, వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమో యని తన్ను వెదకు నిమిత్తము నిర్ణయ కాలమును వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా నుండువాడు కాడు. మన మాయనయందు బ్రతుకుచున్నాము. చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము. అటువలె మనము ఆయన

సంతానమని మీ కవీశ్వరులలో కొందరును చెప్పుచున్నారు. కాబట్టి మనము దేవుని సంతానమై యుండి, మనుష్యుల చమత్కార కల్పనలవలన మల్చబడిన బంగారమునైనను, వెండినైనను, రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంపకూడదు. ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యునిచేత భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగ జేసియున్నాడు." (అ.కా. 17:22-31). ఈ పెద్ద వాక్యభాగములోని అంశములను పరిశీలింపుము. విగ్రహముల ద్వారా దేవుడు సేవింపబడడు. దేవుని పథకములో జాతుల భేద మేమియును లేదు.

దేవుడే మన పాలకుడు. అందరు మారుమనస్సు పొందవలెనని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు. మన యిష్టమును ఆయన చిత్తమునకు లోబరచవలెను. వాగ్దాన పూర్వకముగా ఆయన యేసును లేపినాడు.

తనకు విధేయులైన వారి కందరికి నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:10). దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నాను. ప్రతి జనములోను ఆయనకు భయపడి నీతిగానడుచుకొను వానిని ఆయన అంగీకరించును (అ.కా. 10:34, 35).

తన యొద్దకు రావలెనని యేసు అందరిని ఆహ్వానించు చున్నాడు. పాప, దుఃఖ, మరణములతో కూడిన ఈలోకమందు యేసు యిట్లనుచున్నాడు. "శాంతి మీకనుగ్రహించి వెళ్ళుచున్నాను. నా శాంతినే మీకనుగ్రహించుచున్నాను. లోక మిచ్చినట్టుగా నేను మీకనుగ్రహించుటలేదు. మీ హృదయమును కలవరపడనియ్యకుడి, వెరవ నియ్యకుడి." (యోహా 14:27). నీ భారము తేలికగా నున్న

దని ఆయన చెప్పుచున్నాడు. నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలను (ఫిలిప్పీ 4:13). కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును ఫిలిప్పీ 4:19). మన ముస్లిము స్నేహితులేమి, హైందవ స్నేహితులేమి అందరికి యేసుక్రీస్తునందే రక్షణ గలదు. (అ.కా. 4:12). మతశాఖ స్నేహితులకు, క్రీస్తు ఏ సంఘము కొరకు చనిపోయెనో దాని యొద్దకురండి (అ.కా. 20:28). ఆయన రక్తముతో కొనబడిన శరీరమదియే. యేసు యిట్లు హెచ్చరించుచున్నాడు: "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా యున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు." (మత్తయి 15:8, 9).

---

## 5. దేవుని నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు

### (*Do not take the Name of God invain*)

యెహోవా దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయుల కిచ్చిన పది ఆజ్ఞలలో మూడవది దేవుని గూర్చి మనము సరియైన విధంగా ఆలోచించాలని తెలియజేయుచున్నది. నిర్గమ .20:7లో దేవుని ఆజ్ఞ ఇట్లున్నది: "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు; యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరింపు వానిని నిర్దోషిగా ఎంచడు".

దేవుని నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదని ఇక్కడ ఆజ్ఞాపింపబడినది. వ్యర్థముగా అంటే అనవసరముగా, ఏ పని లేకుండా, మాటలలో సత్యము లేకుండా దేవుని నామమును ఉచ్చరింపకూడదు. కొందరు మాట్లాడితే ఒట్టు పెట్టు కొంటారు, దేవుని నామాన్ని బట్టి

పొందుతారు, బూతులాడతారు. అట్టి దుర్భాషను దేవుడు ఖండించాడు, నిషేధించాడు. "సర్పసంతానమా, మీరు చెడ్డవారైయుండి ఏలాగు మంచి మాటలు పలుకగలరు? హృదయమందు నిండియుండు దానిని బట్టి నోరు మాటలాడును గదా" యని యేసుప్రభువు బోధించాడు (మత్త 12:34). "వినువారికి మేలు కలుగునట్లు అవసరమును బట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకుడిగాని దుర్భాష యేదైనను మీ నోట రానియ్యకుడి" యని అపొ. పౌలు వ్రాసాడు (ఎఫెసీ 4:29).

## శపించరాదు

కొందరు బూతులాడేటప్పుడు తమ ప్రత్యర్థులపై శాపవచనాలను పలుకుతారు. అంటే దేవుడే వారిపై పగతీర్చుకోవాలని వారి ఉద్దేశ్యం. అయితే "మీ శత్రువులను ప్రేమించుడి; మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి, ఆయన చెడ్డవారి మీదను మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను వర్షము కురిపింపజేయుచున్నాడు. మీరు మిమ్మును ప్రేమించిన వారినే ప్రేమించిన యెడల మీకేమి ఫలము కలుగును?" అని యేసుప్రభువు బోధించాడు (మత్త 5:44-46). నీ పొరుగు వానిని శపించాలని గాక ప్రేమించాలని యేసుప్రభువు బోధించాడు. దేవుడెవరిని శపించడు. దుష్టులు మరణము నొందుటవలన ఆయన సంతోషించడు (యెహెజ్కేలు 33:11). అందరు మారుమనస్సు పొంది రక్షింపబడాలని దేవుడు కోరుచున్నాడు (2 పేతురు 3:9). ఎవడైనను నశిస్తే అతడు తన అవిధేయత, అవిశ్వాసము వలన నశిస్తాడు. ఏలయనగా అందరు రక్షింపబడే మార్గాన్ని దేవుడేర్పరచాడు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడును" అని యేసుప్రభువు చెప్పాడు (మార్కు 16:16).

వేషధారణ వలన కొందరు దేవుని నామమును వ్యర్థముగా ఉచ్చరిస్తారు. పైకి భక్తిపరులుగా కనబడడానికి మాట్లాడితే దేవుని పేరెత్తుతారు. ఈ మధ్య ఒక తెగవారు కనబడితే చాలు "ప్రెయిజ్ దలార్డ్" (Praise the Lord) అనడం మొదలుపెట్టారు. సహోదరులు ఒకని కొకడు వందనములు చెప్పుకోవాలని యున్నదిగాని దేవుని నామమును ఇలా వ్యర్థముగా ఉచ్చరించాలని లేదు. యేసు మత్తయి 7 : 21లో, "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించునని" చెప్పాడు. "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక, ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" అని లూకా 6 : 46లో యేసు అడిగాడు. పైకి భక్తి పరులుగా నటించు వారి వలన దేవుని నామము దూషింపబడతాది. "మిమ్మును బట్టియేగదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది?" యని అపో. పౌలు ప్రశ్నించాడు (రోమా 2 : 24).

## విమర్శ యుంటాది

అనవసరంగా, సందర్భ రహితంగా దేవుని నామమును ఉపయోగించుటవలన ఆయన నామము వ్యర్థంగా ఉచ్చరింపబడతాది. కొందరు హాస్యంకొరకు నవ్వులాటగా దేవుని నామము నుపయోగిస్తారు. అట్లు చేయుటవలన ఆయన నామానికి ఉండవలసిన పరిశుద్ధ, పవిత్ర భావాలు మన హృదయంలో ఉండవు. "కృతజ్ఞతా వచనమే మీరు చ్చరింపవలెనుగాని మీరు బూతులైనను, పోకిరి మాటలైనను సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు; ఇవి మీకు తగవు" అని అపో. పౌలు ఎఫెసులోని క్రైస్తవులను హెచ్చరించాడు (ఎఫెసీ 5 : 4). మత్తయి 12 : 36, 37లో యేసు ప్రభువు ఇట్లు హెచ్చరించాడు: "నేను మీతో చెప్పునదేమనగా-మనుష్యులు పలుకు వ్యర్థమైన

ప్రతి మాటను గూర్చియు విమర్శ దినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలనుబట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు, నీ మాటలను బట్టియే అపరాధివని తీర్పు నొందుదువు."

దేవుని నామమమున ఒట్టు పెట్టుకొనుట ద్వారా కొందరు ఆయన నామమును వ్యర్థముగా ఉచ్చరిస్తారు. యేసు ప్రభువు ఇట్లు బోధించాడు: "నేను మీతో చెప్పున దేమనగా - ఎంత మాత్రము ఒట్టు పెట్టుకొనవద్దు; ఆకాశము తోడనవద్దు, అది దేవుని సింహాసనము, భూమి తోడనవద్దు, అది ఆయన పాదపీఠము, యెరూషలేము తోడన వద్దు; అది మహారాజు పట్టణము. నీ తల తోడని ఒట్టు పెట్టుకొనవద్దు; నీవు ఒక వెండ్రుకనైనను తెలుపుగా గాని, నలుపుగా గాని చేయ లేవు" (మత్త 5:34-36). అపొ. యాకోబు ఇట్లనుచున్నాడు: "నా సహోదరులారా, ముఖ్యమైన సంగతి ఏదనగా ఆకాశము తోడనిగాని, భూమి తోడనిగాని, మరి దేనితోడనిగాని ఒట్టు పెట్టు కొనక మీరు తీర్పు పాలుకాకుండునట్లు అవునంటే అవును కాదంటే కాదని ఉండవలెను" (యాకోబు 5:12).

దేవుని నామమును వ్యర్థముగా గాక, సరిగా వినియోగించడం మనము నేర్చుకోవాలి. దేవుని నామమును మనము మహిమ పర్చాలి. "పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచ బడును గాక" యని ప్రార్థించుమని యేసుప్రభువు తన శిష్యులకు నేర్పించాడు (మత్తయి 6:9). మనము దేవుని నామమందు విశ్వాస ముంచాలి. "ఆయన యందు విశ్వాసముంచు వాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందునని ప్రవక్త లందరు ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నారని" పేతురు కొర్నేలి యింటివారికి ప్రకటించాడు (అపొ. కా. 10:43). ఆయన నామమును బట్టి మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింప

బడాలి (లూకా 24 : 47). మనము యేసు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనాలి. నీతి కలుగునటు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనునని రోమా 10 : 10లో వ్రాయబడియున్నది. తరువాత మానవులు తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మము పొందాలని యేసుప్రభువు ఆజ్ఞాపించాడు (మత్తయి 28 : 19).

మనము దేవుని నామాన్ని, లేక క్రీస్తు నామాన్ని ధరించాలి, క్రైస్తవుడైనందుకు సిగ్గు పడక ఈ నామమునుబట్టియే దేవుని మహిమపర్చాలని 1 పేతురు 4 : 16లో వ్రాయబడియున్నది. మనము ఆయన నామమునుబట్టి కూడుకొనాలి. "ఏల యనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని" యేసు ప్రభువు చెప్పాడు (మత్తయి 18 : 20). "మరియు మాటచేతగాని క్రియ చేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" అని చెప్పబడినది (కొలస్స 3 : 17).

తరువాత యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్ఛరించువానిని నిర్దోషిగా ఎంచడని జ్ఞాపక ముంచుకొందాము. గొర్రెపిల్ల జీవ గ్రంథమందు వ్రాయబడిన వారే పరలోకంలో ప్రవేశిస్తారు. నిషిద్ధమైన దేదయినను, అసహ్యమైన దానిని అబద్ధమైన దానిని జరిగించువాడైనను దానిలో ప్రవేశింపనే ప్రవేశించడు (ప్రక 21:27). నీ పేరు దేవుని జీవ గ్రంథమందు వ్రాయబడియున్నదా ?

— జాషువా గూటం

## క్రీస్తు సంఘము

1. ముక్తి పథమును తెలియగ భక్తులారా (సామెతలు 14:12)
యుక్తమార్గము బైబిలు చదువుకొనుడి
(యెష 34 : 16; అ. కా. 17 : 11).
సత్యవాక్యమును సరిగాను విభజించి (2 తిమోతి 2 : 15).
దైవరాజ్యము నీతి తెలిసి మనుడీ ! (మత్తయి 6 : 33).

2. పరసౌఖ్యములు వీడి పాపులన్ ప్రేమించి
(1 తిమోతి 1 : 15; మత్త 1 : 21;)
పుడమిపై నరుడుగా బుట్టినట్టి (లూకా 19:10; యోహా 10:10).
క్రీస్తుయేసును గూర్చి విని విశ్వసించియు (రోమా 10:9-10).
ప్రభువు నొప్పుకొనుడి ఫలము గలదు ! (యోహాను 17 : 3).

3. ఎవరికోసము యేసు సిలువలో మరణించె
(యోహాను 1 : 29; 3: 14-15;).
ఎవరికోసము యేసు త్యాగియాయె ? (ఫిలి 2 : 6-11;).
పాప బాధితులకు పరలోకమును జూప (ప్రకటన 7 : 15-17)
రక్తమును చిందించి రాజుయాయెన్ ! (ప్రకటన 17 : 14)

4. అట్టి క్రీస్తు మృతి పునరుత్థానమునకు (అ.కా. 2 : 31-32)
సాక్షులయ్యిన యపొస్తలుల బోధన్ (మత్త 28 : 16-20)
అనుసరించియు ఆత్మరక్షణను పొంది (అ. కా. 2:38-42)
సంఘమందున జేరిన క్షేమమగును ! (1 కొరింథి 1 : 5-9)

5. సంఘమునకు క్రీస్తు శిరస్సైయుండగ (ఫిలి 1 : 15-18)
సంఘమునకు వేర్వేరు పేరులేల ? (1 కొరింథి 1 : 13)
క్రీస్తు సంఘమునిన కీర్తి దేవుని దాను (ఎఫెసి 3 : 20-21)
సంఘ వధువుకొరకే ప్రభువు వచ్చున్ ! (ప్రకటన 22 : 17-20)

"క్రీస్తుసంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి.
రోమా 16 : 16;"

— సామ్యూల్ జాన్ మేడిది. కొణిశివాడ.

---

## హెబ్రీ బాలిక

ఒక హెబ్రీ బాలికను గూర్చి దైవాత్మ 2 రాజులు 5 : 2-3 వచనములలో తెలియజేయుచున్నాడు. బైబిలులో తెలియజేయబడిన వ్యక్తులు వారు నీతిగా జీవించిన లేక దిగజారిపోయిన స్థితిలో యుండిన వారి, వారి పనులను లేక క్రియలను బట్టి వారికి దైవ దీవెనలుగాని, లేక దేవునినుండి శిక్షగాని సంభవించును. వారి, వారి జీవిత విధాన మును బట్టి మన జీవితములను దేవుని కంగీకారముగ యుండునట్లు చేయుట కొరకు వారికి బైబిలు నందు తావు దొరికెను. ఈ చిన్న హెబ్రీ బాలిక, దేవుని కంగీకారమైన కార్యము ఒకటి చేసింది. దానిని బట్టి, ఆ బాలికను గూర్చిన విషయము బైబిలు నందు పరిశుద్ధాత్మ ద్వారా వ్రాయించబడెను, కాని ఆమె పేరుగాని, తండ్రి పేరుగాని తెలియపరచబడలేదు. ఈ చిన్న బాలిక చేసిన ఈ చిన్న కార్యము ద్వారా మనము గొప్ప పాఠమును నేర్చుకొనగలము.

### దేవునిగూర్చి చెప్పాలి

ఈ బాలిక చిన్నదే అయినప్పటికిని తన యజమానికి కలిగిన వ్యాధి యొక్క భయంకరత్వమును గూర్చి తన దేవుడైన యెహోవా

ప్రివక్తయైన ఎలీషా ద్వారా చేయుచుండిన గొప్ప కార్యముల గూర్చియు ఎరిగిన దై యుండెను. ఈ చిన్న బాలిక తన స్వజనులను, స్వస్థలమును, తల్లిదండ్రిలను విడిచి చాల దూరదేశములో యుండి పరిచారకురాలై యుండి నప్పటికిని తన జనాంగమునుగాని, తన దేవునిని గాని తన కష్టములలో మరువలేదు. ఈ బాలికవలె మనము కూడ మన స్వజనమును, స్వస్థలమును విడిచి ఎందు పోయినప్పటికిని మన దేవునిని మనము మరువ కూడదు. మనము ఎచ్చటకు వెల్లిన యోసేపు ఐగుప్తునకు, దానియేలు బబులోనుకు తమ దేవునిని గూర్చి తెలియబరచిన రీతిగ మనమును మన దేవునిని గూర్చి తెలియ పరచాలి.

తన సహోదరుల ద్వారా యోసేపు ఐగుప్తు వర్తకులకు అమ్మ బడ్డాడు. 17 సం॥ల వయుసులో యోసేపు ఐగుప్తునకు కొనిపోబడ్డాడు. అతడు పొతీఫరు యింటి యందున్న పుడుగాని, చెరసాల యందున్నపుడు గాని తన దేవునిని విడిచిపెట్టినవాడు కాడు. ఐగుప్తు రాజైన ఫరో యెదుట యోసేపు నిలువబడు నాటికి అతనికి 30 సం॥ల వయసు (ఆది కా. 41 : 46). ఈ 13 సం॥ల కాలమును యోసేపు భరించి దేవుని కొరకు నీతిగ నిలువబడెను. దానియేలు, అతని స్నేహితులు రాజు భోజనమును తిరస్కరించుట ద్వారా దేవుని ఆజ్ఞకులోబడిరి. బంగారు ప్రతిమకు నమస్కరింపక దేవుని మహిమ పరచిరి. దానియేలు తన దేవునికొరకు నిలువబడి నందున సింహపు బోనులో పడద్రోయ బడినను అతడు జయ శాలిగ దానినుండి విడిపింపబడెను. చిట్టచివరకు దానియేలు 6 : 26-27లో వ్రాయబడిన ప్రకారము రాజైన నెబుక ద్నెజరు ప్రకటన చేయుటకు కారకుడాయెను. ఆ ప్రకటన ఈ విధ ముగ యున్నది. "నా రాజ్యములోని సకల ప్రభుత్వముల యందుండు నివాసులు దానియేలు యొక్క దేవునికి భయపడుచు ఆయన సముఖ మున వణకుచుండవలెను. ఆయనే జీవముగల దేవుడు. ఆయనే

యుగ యుగము లుండువాడు. ఆయన రాజ్యము నాశనము కానేరదు. ఆయన ఆధిపత్యము తుదమట్టుకు నుండును. ఆయన విడిపించువాడును, రక్షించు వాడునై యుండి, పరమందును, భూమి మీాదను సూచక క్రియలను ఆశ్చర్య కార్యములను చేయువాడు. ఆయనే సింహముల నోటనుండి ఈ దానియేలును రక్షించెను.

## కీడుకు ప్రతికీడు చేయరాదు.

ఈ చిన్న బాలిక కీడుకు ప్రతికీడు చేయలేదు. సిరియాదేశపు సైనికుల ద్వారా ఆమె తన తల్లిదండ్రుల నుండి, స్వదేశమునుండి ఎంతో దూరం పరచబడినప్పటికిని తన యజమానునికి కలిగిన కష్టమును చూచి ఆమె సంతోషించలేదు. కొన్నిసార్లు మనకు ఇష్టము లేనివారికి ఏ ఆపదయైనా కలిగినచో మనము సంతోషిస్తాము. అయితే పరిశుద్ధుడైన పౌలు థెస్సలోనికయులకు ఈ విధముగ వ్రాయుచున్నాడు. 1 థెస్స 5 : 15. "ఎవడును కీడునకు ప్రతికీడు ఎవనికైనను చేయకుండ చూచుకొనుడి. మీారు ఒకని యెడల ఒకడును మనుష్యులందరి యెడలను ఎల్లప్పుడును మేలయిన దానిని అనుసరించి నడుచుకొనుడి. ఎల్లప్పుడును సంతోషముగా ఉండుడి. ఎడతెగక ప్రార్థన చేయుడి."

## మేలు చేయాలి

ఈ బాలిక చిన్నదే అయినప్పటికిని ఆమె ఇతరులకు ఆశీర్వాద కారకురాలయ్యింది. తన యజమానికి స్వస్థత పొందగల స్థలమేదీ, ఎవరి దగ్గరకు వెళ్లవలెనో ఆ విషయాన్ని గూర్చి తెలియజేసింది. ఆమె చేయగలిగిన కార్యమును ఆమె చేసింది. మనం ఆ విధంగ యితరులకు మేలు చేయువారముగ, ఆశీర్వాద కారకులముగ యుంటున్నామా ? మనము తరుణము దొరికిన కొలది ఇతరులకు మేలు చేయువారముగ యుండాలి. అందుకే పౌలు ఈ విధంగా వ్రాస్తున్నాడు." కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరియెడలను,

విశేషముగ విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము (గలతి 6:10). ఈ చిన్నబిడ్డ వలె మనము కూడ ఇతరులను దేవుని యొద్దకు నడిపించే వారముగ యుండాలి. ఆశీర్వాదములు పొందుట కొరకు వారిని ఆహ్వానించాలి.

నయమాను యొక్క ఔన్నత్యముగాని, ధనముగాని, ఉద్యోగముగాని అతనిని దేవుని దగ్గరకు నడిపించలేదుగాని అతని రోగమే అతనిని దేవుని దగ్గరకు తీసుకు వచ్చింది. యొర్దాను నదిలో ఏడు మార్లు మునుగు మని ఎలీషా చెప్పినపుడు అతడు అట్లు చేయుటకు అతని గర్వము అడ్డు వచ్చింది. అయితే అతడు స్వస్థత పొందుటకు తప్పని సరిగ దేవుని ఆజ్ఞకు లోబడవలసి వచ్చింది. నూరు వేల సార్లు అతడు తన కిష్టమైన నదులలో మునిగి యుండగలడు. కాని అతనికి స్వస్థత చేకూరదు. మనము కూడ రక్షించబడుటకు దేవుని ఆజ్ఞలను పాటించాలి.

నయమాను స్వస్థపరచబడిన తరువాత అతడు నూతన వ్యక్తిగ మారిపోయాడు. ఎలీషాకు కృతజ్ఞత చెప్పుకొనుటకు తన పరివార మంతటితో కానుకలతో నయమాను తిరిగి ఎలీషా దగ్గరకువచ్చాడు. ఈ సారి ఎలీషా నయమానును కలసికొనుటకు బయటకు వచ్చెను. రాజైన నెబుకద్నెజరు వలె నయమాను కూడ తన పరివార మంతటి యెదుటను ఈ విధంగా చెప్పుచున్నాడు. II రాజులు 5 : 15 "చిత్తగించుము. ఇశ్రాయేలులోనున్న దేవుడు తప్ప లోకమంతటి యందును మరియొక దేవుడు లేడని నేను ఎరుగుదును". తాను తీసుకు వచ్చిన కానుకలను ఎలీషా నిరాకరించి నప్పుడు II రాజులు 5:17లో వ్రాయబడినట్టు "యెహోవాకు తప్ప దహన బలియైనను మరియే బలియైనను ఇతరమైన దేవతలకు నేనికను అర్పింపను." అని చెప్పెను.

— కవితగూటం, కాకినాడ.

---

## " నాడు - నేడు "

నాడు క్రీస్తు ప్రభువు
శిలువలో తన విలువైన
రక్తం కార్చి స్థాపించాడు
క్రీస్తు సంఘం ఇలలో (మత్త 16 : 18)
నేడు అనేక రకరకాలైన మానవ
కల్పిత పేర్లతో ఎన్నో రకాల
సంఘాలున్నాయి - ఇలలో

*　　　*　　　*

నాడు క్రీస్తు సువార్త వ్యాప్తియే
పరమావధిగా నుండె భక్తులకు
నేడు వివిధరకాల కుమ్ములాటలు
ఆస్తిపాస్తులకై పోరాటాలతో
సంఘాన ఆధిపత్యమునకై - రకరకాల
కుయుక్తులతో నిండుకొని ఉన్నాయి
నామకార్థ సంఘాలు - కొన్ని

*　　　*　　　*

నాడు సభ్యులు సంఘాభివృద్ధికై
తమ ఆస్తిపాస్తులు సమర్పించారు
నేడు సంఘ ఆస్తిపాస్తులు తమవిగా
చాటుకొని స్వాధీన పర్చుకొంటున్నారు ఎందరో.

*　　　*　　　*

నాడు ఇతియొపి ప్రధానికి
బాప్తిస్మమిచ్చాడు పరిశుద్ధాత్మ
నడిపింపుతో ఫిలిప్పు గాజామార్గంలో
నేడు పెండ్లికై లేక సంఘసభ్యత్వంనకై

లేక మిషనరీగారి రాకసందర్భాన
లేక సంవత్సరాంతాన ఇచ్చు ఆచారంలోనో
తీసుకొనుచున్నారు - బాప్తిస్మాలెన్నో

* * *

నాడు సువార్త వినుచుండిరి వినిన దాన్ని విశ్వస్తుండిరి.
విశ్వసించిన దాన్ని మనస్సున అంగీకరించి
ఆపై - నీళ్ళలో బాప్తిస్మం పొంది
చాటెడి వారు లోకాన క్రీస్తునామం.
నాడు ఆలు బిడ్డలను అన్నదమ్ములను
పరిత్యజించి సువార్త ప్రకటించారు భక్తులు.
నేడు నాలుగుగోడల మధ్యన రాతి కట్టడాన పీఠమెక్కి
ఎగిరెగిరి చెప్తారు - ప్రసంగాలు ఎన్నో.

* * *

నాడు రాళ్ళ దెబ్బలు తిన్నారు సభల కీడ్చబడినారు
రంపాలతో కోయబడ్డారు తలక్రిందులుగా శిలువ వేయబడ్డారు.
సల సలా కాగే నూనెలో ముంచబడ్డారు.
సింహాల కాహారంగా వేయబడ్డారు.
మరి నేడు సీలింగ్ ఫ్యానులముందు టీవీ సెట్లముందు
ఎయిర్ కూల్డు బంగళాల యందు
ఖరీదైన పానీయాలు పుచ్చుకొని
ఇంకా సహాయం రాలేదని వేదన చెందుచున్నారు కొందరు.

* * *

నాడు దైవభక్తిలో పారవశ్యం చెంది పాడుకొన్నారు
ఆత్మసంభధమైన కీర్తనలు కొన్ని
చెఱసాలలందు కొండలపైన చీకటి గదులలోన ఎందరో.
నేడు భీకరధ్వని తరంగాల నడుమ విలాసంగా ఊగుతూ
ఆర్కెస్ట్రా ముందు పాడేదేమో వినిపించని గోలలో
జోగుచున్నారు - కొందరు భక్తి పారవశ్యంతో నిండి.

నాడు తమకున్నది కొంచెం పరులతో - పంచుకొన్నారు
కాని నేడు - ఇతరులది తమదేనని - చాటుగా వాటాలు
తీసుకొంటున్నారు - ఎందరో.

* * *

నాడు పరమరాజ్యంనకై ఎదురుచూస్తూ -
నీరాజ్యం వచ్చుగాక - అని ప్రార్థించారు.
ప్రభు వాగ్దానం ప్రకారం పెంతెకొస్తు పండుగనాడు
ఆయన రాజ్యం రెక్కలు చాచుకొని
నాలికెలు అగ్ని శిఖలై సాగ దిగివచ్చింది దివినుండి భువికి.
ఆయన రాజ్యం కళ్ళారా చూచినా-నీరాజ్యం రాలేదంటూ
వచ్చుగాక అని ప్రార్థిస్తూ తమ్మును
తాము మరచిపోతున్నారు కొందరు.

— K. జానకిరావు, హిందూపురం.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA 533 001

No.

To